# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు.
- ❖ రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- ❖ ఎన్నికల హామీల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు.
- ❖ అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఘనంగా నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని ప్రధాన మంత్రిని కోరారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం కోరడంతో పాటు మౌలిక వసతుల కల్పన, అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడానికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతపురం - అమరావతి ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణంతో పాటు, కీలక రహదారుల మరమ్మతులు, పట్టణ, గ్రామీణ పేదల ఇళ్లు, జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా వంటి ముఖ్యమైన అంశాలపై విజ్ఞప్తులు చేశారు. ప్రధానమంత్రితో సమావేశానికి ముందు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిశారు. ఆ తర్వాత మరికొందరు మంత్రులను కలిసి వినతులు సమర్పించారు. ఇదిలా ఉండగా రేపు ఉదయం 9 గంటలకు నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం, 10 గంటలకు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, 10 గంటల 45 నిమిషాలకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. అనంతరం సాయంత్రం ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రి తిరుగు పయనమవనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ ఈరోజు అమరావతిలోని సచివాలయంలో

తొలిసారిగా సమావేశమయ్యింది. హోంశాఖా మంత్రి అధ్యక్షురాలిగా ఉన్న ఈ కమిటీలో మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, గుమ్మడి  సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశానికి డీజీపీ, సీఐడీ, ఇంటెలిజెన్స్ అదనపు డీజీలు, సెబ్ డైరెక్టర్ హాజరయ్యారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం హోంశాఖ మంత్రి అనిత మాట్లాడుతూ....

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల హామీల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి సూచించారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఈరోజు ఆయన పరామర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే విషయంపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని, ఇప్పటికే పాఠశాలలు మొదలయ్యాయని, “తల్లికి వందనం” పేరుతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులందరికీ ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చినా.. ఇంతవరకూ దానిని నెరవేర్చలేదన్నారు. రైతులకు అందించాల్సిన “రైతు భరోసా” కూడా ఇంకా ఇవ్వలేదన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పలువురు మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించిన ఈ జయంతి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. “స్వాతంత్ర్యం నా జన్మ హక్కు” అని ఆచరణలో చూపిన వ్యక్తి అల్లూరి సదా ప్రాతః స్మరణీయుడు అని కొనియాడారు. అటువంటి మహనీయుల నుంచి స్ఫూర్తి పొందడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ వేడుకలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి వేడుకలుగా జరిపించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన దస్త్రాలను దగ్ధం చేయడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. దగ్ధమయిన దస్త్రాలకు సంబంధించిన వివరాలను తక్షణమే అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరెవరు ఉన్నారనే అంశాలపై నివేదిక ఇవ్వాలని, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయాల్లో దస్త్రాలను భద్రపరచేందుకు అనుసరిస్తున్న విధానాల గురించి  వివరాలు వెల్లడించాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 ప్రపంచ కప్ గెలిచిన భారత్ జట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈరోజు సమావేశమయ్యింది. ఈ సమావేశానికి భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లితో సహా ఇతర ఆటగాళ్లు హాజరయ్యారు. క్రీడాకారులతో సంభాషించిన ప్రధాన మంత్రి వారి అనుభవాలను తెలుసుకున్నారు. కాగా, ఈ ఉదయం న్యూఢిల్లీ చేరుకున్న భారత క్రికెట్ జట్టుకి ఘన స్వాగతం లభించింది. ముంబై లో బీసీసీఐ ఏర్పాటు చేసిన భారీ రోడ్ షో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గత ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖలో భారీ కుంభకోణం జరిగిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రేషన్ లో పేదలకు ఇచ్చే పంచదార, అంగన్వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనె ప్యాకెట్లు తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించామన్నారు. నిర్దేశిత పరిమాణం కంటే తూకం తక్కువగా ఉండటంతో పౌర సరఫరాల శాఖను ప్రక్షాళన చేస్తామని మంత్రి తెలియజేస్తూ ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కజకిస్తాన్ అస్తానాలో ఈరోజు జరిగే షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సులో కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పాల్గొన్నారు. SCO కౌన్సిల్ 24వ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న నాయకులు గత రెండు దశాబ్దాలుగా సంస్థ కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, బహుపాక్షిక సహకారం అవకాశాలను చర్చించనున్నారు. అదేవిధంగా ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలు కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఇసుక కొరత రానీయకుండా కోటి మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామని రాష్ట్ర గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. త్వరలో ఉచిత ఇసుక విధానంపై మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. రానున్న మూడు నెలల వరకు కోటి టన్నుల ఇసుక అవసరం ఉంటుందని అంచనా వేశామన్నారు. వర్షాకాలం కావడంతో నదుల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం ఉండదని, ఇందుకు పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, అందుకే నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఇసుక అక్రమాల్లో భాగస్వాములైన అందరిపైనా చర్యలు తీసుకుంటామని, అలాగే గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపైనా విచారణ జరిపిస్తామని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరి ఎపిఐఐసి టవర్స్ లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో అబుదాబికి చెందిన ఎంఎఫ్-2 సంస్థ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశమున్న రంగాలపై జినోమిక్స్, పర్యావరణ మెడ్ టెక్, బయోటెక్ విభాగాల్లో అపారమైన అనుభవమున్న ఎంఎఫ్-2 సంస్థతో ప్రాథమికంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో బల్క్ డ్రగ్ పార్క్ మొదటి స్థానంలో ఉన్న విషయాన్ని, అలాగే సుమారు 170 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎపి మెడ్ టెక్ జోన్, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 3 ఎకనమిక్ జోన్లలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని వారికి వివరించామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశాలోని పూరి జగన్నాథుని రథయాత్ర సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు నడపనున్నామని ఈస్ట్‌కోస్ట్ రైల్వేశాఖ ప్రకటించింది. ఎనిమిది ప్యాసింజర్ రైళ్లు నడుపుతామని అందులో భాగంగా పలాస - పూరీ స్పెషల్ పలాస నుంచి ఈనెల 7, 15, 17వ తేదీల్లోనూ, అలాగే విశాఖపట్నం - పూరీ స్పెషల్ హరిపూర్‌గ్రామ్, అర్గుల్ మీదుగా, విశాఖపట్నం నుంచి ఈ నెల 6, 14, 16వ తేదీల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =